సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 21 । జూన్ । 2023



సరిగమలూ.. మధురిమలు..!
నేడు ప్రపంచ సంగీత దినోత్సవం. ఈ సందర్భంగా జిల్లాలోని సంగీతకారులు, స్థితిగతుల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం. - 8లో



హోటళ్లపై విజిలెన్స్ దాడులు
విజిలెన్స్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం మంగళవారం జిల్లాలోని పలు హోటళ్లపై విస్తృతంగా దాడులు నిర్వహించింది. - 8లో



'యోగా' భారత్ మహాన్
భారత ప్రధాని మోదీ సూచన మేరకు 2014 సెప్టెంబరు 27న ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. - 8లో

న్యూస్‌రీల్

డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట కృష్ణ బదిలీ

కడప రూరల్ : జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలనశాఖ జమ్మలమడుగు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటకృష్ణ కావలికి బదిలీ అయ్యారు. ఈయన గత మూడేళ్లుగా ఇక్కడ విధులను నిర్వహిస్తున్నారు. వెంకట కృష్ణ స్థానంలోకి ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా రాయచోటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అండ్ డీడీసీఓ ఎస్.జయరాముడు బాధ్యతలను చేపట్టనున్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓకు పదోన్నతి

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎ.ఉమామహేశ్వరకుమార్‌కు జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ (డీఐఓ)గా పదోన్నతి లభించింది. ఈయన ఇక్కడ మూడేళ్ల నుంచి విధులను చేపడుతున్నారు. ఇక్కడ డీఐఓగా పనిచేస్తున్న డాక్టర్ మల్లీశ్వరి తిరుపతికి బదిలీ అయ్యారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్స్, సీఆర్‌టీలతోపాటు పలు పోస్టుల భర్తీ విషయమై ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని కేజీబీవీల్లో 132 పోస్టులకు 3600 దాకా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ పోస్టులకు సంబంధించి ప్రతి పోస్టుకు 1:3 నిష్పత్తిలో మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతిలో పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. ఎవరు కూడా దళారులను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని ఆయన సూచించారు.

జేఎన్‌టీయూ బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఇటీవల నిర్వహించిన బీటెక్ నాల్గవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వసుంధర తెలిపారు. 24మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 20మంది ఉత్తీర్ణులై 83.33 ఉత్తీర్ణత శాతం వచ్చిందన్నారు. ఫలితాలను తక్కువ సమయంలోనే విడుదల చేసిన పరీక్షా కేంద్ర విభాగాధిపతులు త్యాగరాజన్, రాధాకృష్ణలను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ అభినందించారు.

విద్యాకానుక కిట్లు వందశాతం బయోమెట్రిక్ వేయించాలి

కడప ఎడ్యుకేషన్: జగనన్న విద్యాకానుక వందశాతం బయోమెట్రిక్ వేయించడంలో సచివాలయ, విద్యాశాఖ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్, నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, పుష్పలతల ఆధ్వర్యంలో స్వయంగా బయోమెట్రిక్ అథెంటికేషన్‌ను వేయించారు. మంగళవారం నాటికి జిల్లాలో 58,747 మంది విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నియమితులైన డీఎస్సీ–2008 ఎంటీఎఫ్ ఉపాధ్యాయులందరూ 21వ తేదీ బుధవారం కడప డీఈఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు తప్పక హాజరు కావాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులంతా ఉదయం 10 గంటలకంతా డీఈఓ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

సూక్ష్మ తరహా పరిశ్రమల స్థాపనకు దరఖాస్తులు



కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లాలో ప్రధానమంత్రి–సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద పచ్చళ్లు, అప్పడాలు, ప్రాసెస్డ్ సుగంధ ద్రవ్యాలు, చిరుధాన్యాల సంబంధిత ఆహార పదార్థాల ఉత్పత్తుల సూక్ష్మ తరహా పరిశ్రమల స్థాపన కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా ఉద్యాన అధికారి ఐజే మైఖేల్‌రాజీవ్ తెలిపారు. దరఖాస్తులను కడప, ప్రొద్దుటూరు, దువ్వూరు, జమ్మలమడుగు, పులివెందుల, పోరుమామిళ్ల, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల పరిధిలోని మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అనాథలకు భరోసా

- నిరుపేదలు, సంరక్షణ లేని బాలబాలికలకు అండగా వాత్సల్య
- 2023–24 ఆర్థిక సంవత్సరానికి 16,045 దరఖాస్తులు
- ఒక్కొక్కరికి నెలకు రూ. 4 వేల ఆర్థికసాయం
- త్వరలోనే ఖాతాల్లో నగదు జమ చేయనున్న ప్రభుత్వం





మిషన్ వ్యాత్సల్య పథకానికి వివరాలు నమోదు చేస్తున్న మహిళా పోలీసు చంద్రకళ (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : అనాథలు, ఎవరూ లేని అభాగ్యులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నూతనంగా మిషన్ వ్యాత్సల్య పథకం ద్వారా అనాథ బాలబాలికలకు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించడానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయించాయి.

అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ. 2600, రాష్ట్ర ప్రభుత్వం రూ. 1400 కలిపి ప్రతినెల రూ. 4 వేలు అందేలా పథకానికి రూపకల్పన చేశారు. పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికలు ఈ వాత్సల్య పథకానికి అర్హులు. స్త్రీ శిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్‌కు 2023–24 ఆర్థిక సంవత్సరానికి 16045 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో పీఎం కేర్స్ పేరుతో ఈ పథకం ఏప్రిల్ 2022–23లో అమలులోకి వచ్చినప్పటికీ లబ్ధిదారులకు నెలకు రూ. 500 చొప్పున కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు చొప్పున వారి ఖాతాలకు జమ చేశారు. అయితే అవగాహన లేక కొద్దిమంది మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు.

16045 దరఖాస్తులు

ఈ ఏడాది క్షేత్ర స్థాయిలో మిషన్ వ్యాత్సల్య పథకంపై ఐసీడీఎస్ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించడంతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు దాదాపు 16045 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో బాలురు 8409, బాలికలు 7636 మంది ఉన్నారు. వారికి త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం ద్వారా తల్లిదండ్రులను కోల్పోయి బంధువుల వద్ద ఆశ్రయం పొందుతున్న వారు, కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన వారు, దివ్యాంగులు, హింసకు గురవుతున్న వారు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడే వారు. ఆర్థికస్థోమత లేని వారు, యాచకులు, పునరావాసం కోసం ఎదురుచూసే బాల బాలికలు, వితంతువుల పిల్లలు వ్యాత్సల్య పథకానికి అర్హులు.

- తల్లీ, తండ్రిని కోల్పోయి బంధువుల వద్ద ఆశ్రయం పొందుతున్న బాలురు 6271, బాలికలు 5634
- హెచ్ఐవీ బాధితుల పిల్లల్లో బాలురు 143, బాలికలు 114
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిలో బాలురు 6, బాలికలు 12 మంది
- వికలత్వం కలిగిన వారిలో బాలురు 336, బాలికలు 214

పథకంపై అవగాహన కల్పిస్తున్నాం



మిషన్ వ్యాత్సల్య పథకంపై అంగన్వాడీ కేంద్రాల్లోని మహిళా పోలీసుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాల్లో అర్హులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకున్నాం. ఈ పథకం ద్వారా నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథలు, అభాగ్యులు, పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతినెల నెలకు రూ.4 వేలు అందజేస్తాయి.
– సుభాష్‌యాదవ్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, కడప

● వలస పక్షుల సందడి

ముచ్చట గొలిపే వన్నెలు.. మిరుమిట్లు పంచే అందాలతో హొయలు పోయే సైబీరియన్ పక్షులు గోపవరం మండలం బేతాయిపల్లెలో గత కొద్దిరోజులుగా సందడి చేస్తున్నాయి. తెలుపు, నలుపు, ఎరుపు వర్ణాలతో అందంగా ఉండే సైబీరియన్ పక్షులు ఏటా తమ గ్రామానికి వచ్చే విదేశీ అతిథులని గ్రామస్తులు చెబుతున్నారు. గుడ్లు పెట్టే సమయానికి ఈ గ్రామానికి వందల సంఖ్యలో వచ్చే బహుదూరపు బాటసారులైన సైబీరియన్‌పక్షులు ఇక్కడి చెట్లపై నివాసాలు ఏర్పరచుకున్నాయి. గుడ్లు పెట్టి పొదగడంతో పాటు పిల్లలు పెద్దవై స్వతహాగా ఎగిరే దశకు చేరుకోగానే స్వస్థలాలకు ఎగిరిపోవడం ఆనవాయితీగా వస్తోంది.

- ఫొటోలు: తీట్ల రమేష్, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం పెరిగేలా ప్రణాళిక

- చిరు ధాన్యాలసాగుకు ప్రోత్సాహం
- ఈ యేడాది 8 లక్షల పశువులకు బీమా
- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ఖరీఫ్‌లో డివిజన్ల వారీగా లక్ష్యాలు కేటాయించి సాగు విస్తీర్ణం పెరిగేలా చూడాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రాధాన్యత రంగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించేలా యాజమాన్య పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. అన్ని పంటలకు ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఆర్బీకేల్లో సూక్ష్మ పోషక, ఖనిజ ధాతువుల స్టాక్‌తోపాటు పురుగు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని చెప్పారు. చిరు ధాన్యాల సాగుపై రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. మండలాల వారీగా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అనుకూలమైన తోటలను పెంచేలా రైతులకు వివరించాలన్నారు. మండలానికి ఒకటి లేదా రెండు ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించేలా చూడాలన్నారు. ఏపీఎంఐపీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను చిన్న, సన్నకారు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సూక్ష్మసాగు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు రెండు నెలల్లోపు పంపిణీ చేయాలన్నారు. వైఎస్సార్ పశుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ ఏడాది ఎనిమిది లక్షల పశువులకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని రకాల వ్యాధులకు స్థానిక పశు వైద్యశాలల్లోనే వైద్యం అందించాలన్నారు. రిజర్వాయర్లు నిండుగా ఉన్న ప్రాంతాల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. పులివెందుల ఫిష్ హబ్‌లో చేపల సరఫరాతోపాటు అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న రైతు బజార్ల పనులు, గ్రామీణ గిడ్డంగులను త్వరగా పూర్తి చేయాలని మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. సహకార సంఘ రైతులకు పంట రుణాలతోపాటు ఆసక్తి ఉన్న వారికి గోడౌన్ల ఏర్పాటు కోసం సాయం అందించాలని చెప్పారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ విజయరామరాజు మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 8వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అలాగే జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై అమూల్ సంస్థ ప్రతినిధులు, డీఆర్డీఏ ఏపీఎంలు, సీసీలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, ఏరియా కో.ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రఘురామిరెడ్డి రాజకీయ జీవితం స్ఫూర్తిదాయకం



మూడు తరాల ప్రజాసారథి పుస్తకావిష్కరణలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కడప ఎంపీ, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ తదితరులు



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- రాజకీయ స్థితప్రజ్ఞుడు రఘురామిరెడ్డి
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- అట్టహాసంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామి రెడ్డి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ
- అభినందించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మైదుకూరు : మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి రాజకీయ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం మైదుకూరులోని కేఎస్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో రఘురామిరెడ్డి జీవిత చరిత్ర 'మూడు తరాల ప్రజాసారథి' పుస్తకావిష్కరణ జరిగింది. డాక్టర్ తవ్వా వెంకటయ్య రాసిన ఈ పుస్తకాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప నగర మేయర్ సురేష్ బాబు, నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయాల్లో దూకుడుకు రఘురామిరెడ్డి పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. ఆయన సహన భూషణుడని తెలిపారు. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితం ఉన్న రఘురామిరెడ్డి నిబద్ధతతో బడుగు బలహీన వర్గాల వారి అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. రాజకీయాల్లో ఒడిదుడుకులను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవాలంటే రఘురామిరెడ్డి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

స్థితప్రజ్ఞుడు రఘురామిరెడ్డి: కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

రాజకీయాల్లో ఓటమికి కుంగిపోవడం, గెలుపునకు పొంగిపోవడం అనేవి ఎరుగని స్థితప్రజ్ఞుడు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆయనతో పరిచయం ఉన్న 12 ఏళ్లలో క్రమశిక్షణ, నిబద్ధత, సహనం అనే మూడు విషయాలను తాను నేర్చుకున్నానని ఎంపీ తెలిపారు. ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న వారిలో రఘురామిరెడ్డి రాష్ట్రంలో ముందు వరుసలో ఉంటారన్నారు. రైతాంగ సమస్యలపై టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. ఏ రిజర్వాయరులో ఎంత నీటి మట్టం ఉందో తెలుసుకుంటూ పంటల సాగులో రైతాంగానికి భరోసా ఇచ్చేవారని పేర్కొన్నారు. పసుపు, కేపీ ఉల్లి పంటలను రైతుల నుంచి కొనుగోలు చేయించి ఆదుకోవడంలో ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు.

ప్రజాభిమానంతోనే..: ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అభిమానం, కార్యకర్తల అండతోనే తాను ఇన్నేళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. తాను 1970లో రాజకీయాల్లోకి వచ్చేనాటికి తమ ఆస్తి ఎంత ఉందో, 1978లో చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చే సరికి వారి ఆస్తి ఎంత ఉందో లోకేష్ తెలుసుకోవాలన్నారు. ఇటీవల తన పాదయాత్రలో తాను అవినీతికి పాల్పడుతున్నట్లు ఎమ్మెల్యేగా కూడా గెలవలేని లోకేష్ ఆరోపించడం శోచనీయమన్నారు. ఏనాడు తాను సంపాదన కోసం రాజకీయం చేయలేదన్నారు.

రఘురామిరెడ్డిది పరిపూర్ణ జీవితం: ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిది పరిపూర్ణ జీవితమని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఎవరి జీవితం సమాజానికి ఉపయోగపడుతుందో అలాంటి వారి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అలాంటి జీవితమే రఘురామిరెడ్డిదన్నారు. ప్రభుత్వ విప్ రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ నేపథ్యం, రాజకీయ నేపథ్యం మెండుగా ఉన్న రఘురామిరెడ్డి రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఏ పార్టీలో ఉన్నా రాజకీయంగా ఐదు దశాబ్దాలపాటు రఘురామిరెడ్డి ప్రజా సేవలో ఉండటం గొప్ప విషయమన్నారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి నిండు నూరేళ్ల ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

రఘురామిరెడ్డి సహకారం మరువలేనిది: కడప మేయర్ సురేష్‌బాబు

పార్టీలకతీతంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తనకు అందించిన సహకారం మరువలేనిదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు తెలిపారు. రఘురామిరెడ్డి 1985లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్నానని, పార్టీలు వేరైనా ఆయన జెడ్పీ అభివృద్ధికి తన వంతు సహకారం అందించారని గుర్తు చేసుకున్నారు. ప్రజా సేవలో నిబద్ధత చూపారన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, తెలంగాణ ఎస్ఎస్‌సీ బోర్డు అసిస్టెంట్ కమిషనర్ జి.గంగిరెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హెచ్.వెంకటసుబ్బయ్య, చారిత్రక రచయిత తవ్వా ఓబుళరెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని అభినందిస్తూ మాట్లాడారు.

▶▶ అట్టహాసంగా పుస్తకావిష్కరణ

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి జీవిత చరిత్ర 'మూడుతరాల ప్రజాసారథి' పుస్తకావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. యోగివేమన యూనివర్సిటీ లలిత కళల విభాగం బాధ్యుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నటరాజ కళాక్షేత్రం బృందం ప్రదర్శించిన నృత్య రూపకాలు అందరిని అలరించాయి. పుస్తకావిష్కరణ అనంతరం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. నియోజకవర్గానికి చెందిన కార్పొరేషన్ డైరెక్టర్లు డి.గంగాధర్‌రెడ్డి, గొడ్లవీటి సుబ్రహ్మణ్యం, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ప్రభావతమ్మ దంపతులను గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అతిథులుగా పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కళాకారులను, పుస్తక రచయిత వెంకటయ్య, ప్రమీల దంపతులను ఎమ్మెల్యే జ్ఞాపికలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేముల : మండలంలోని గొల్లలగూడూరు గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నారెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి (45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతలజూటూరు గ్రామానికి చెందిన అన్నారెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి బాలు ఓబులు అనే వ్యక్తితో కలిసి స్కూటీపై బ్యాంకు పని నిమిత్తం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. గొల్లలగూడూరు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అశోక్ కుమార్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడ పరీక్షించి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో బాల ఓబులుకు గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి సోదరుడి కుమారుడు అన్నారెడ్డి గోవిందరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు.

తల్లిదండ్రులకు విద్యార్థి అప్పగింత


విద్యార్థి నందీశ్వర్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ నాగమురళి

కలసపాడు : కాశినాయన మండలం పిట్టిగుంట గ్రామానికి చెందిన మహానంది కుమారుడు టి.నందీశ్వర్(17) మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో విద్యార్థి తండ్రి పోలీసులకు తెలిపాడు. ఎస్ఐ నాగమురళి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నందీశ్వర్ ఇంటర్మీడియెట్‌లో తక్కువ మార్కులు వచ్చినందు వల్ల తన తండ్రి మందలిస్తాడేమోనన్న భయంతో.. కలసపాడులోని తన అమ్మమ్మ వద్దకు వెళుతున్నానని చెప్పి అక్కడికి వెళ్లకుండా ఎక్కడికో వెళ్లాడు. బంధువుల సహకారంతో నందీశ్వర్‌ను ట్రేస్ చేసి పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి మంగళవారం తండ్రికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగమురళి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఫెయిల్ అయ్యామని, తల్లిదండ్రులు మందలిస్తారని, సమాజం ఏమైనా అనుకుంటుందని ఇంటి నుంచి వెళ్లిపోవడం చాలా తప్పు అన్నారు. విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ ఆలోచనను మార్చుకోవాలని తెలిపారు.

యోగా భారత్ మహాన్

నేడు ప్రపంచ యోగా దినోత్సవం


పుష్పగిరిలో యోగా సాధన చేస్తున్న దృశ్యం(ఫైల్)

కడప కల్చరల్ : ప్రాచీన భారత సంప్రదాయం విశ్వమానవాళికి అందించిన అమూల్యమైన సంపద యోగ. జన్మస్థలం మన దేశమే అయినా ఇక్కడి యోగులు, రుషులు వేల సంవత్సరాల క్రితం ఆసియాఖండంలో ఈ ప్రక్రియను ప్రచారం చేశాయి. మనసు, శరీరాల మధ్య సమన్వయం చేసే ఈ అద్భుతమైన క్రియను ఆ తర్వాత ఎందరో యోగులు, మునులు కాలానుగుణమైన మార్పులు చేస్తూ నేటి తరానికి చేర్చారు. భారత ప్రధాని మోదీ సూచన మేరకు 2014 సెప్టెంబరు 27న ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. నేడు 177 దేశాలు ఈ దినోత్సవాన్ని నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలో యోగా పరిస్థితిని గురించి 'సాక్షి' పాఠకుల కోసం...

మన జిల్లాలో..

కడప నగరంలో మిత్ర యోగా కేంద్రం, విష్ణు యోగా కేంద్రం, విశ్వాత్మ పిరమిడ్ యోగా సొసైటీ, అమ్మవారిశాల, ఆఫీసర్స్ క్లబ్, సాయిబాబా అనాథ శరణాలయం, ఆంజనేయ యోగా కేంద్రం, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలలో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిలో పలు సంస్థలకు మంచి ఆదరణ ఉంది. తర్వాత ప్రొద్దుటూరు, రాజంపేట, బద్వేలు, రాయచోటితోపాటు ప్రస్తుతం దాదాపు అన్ని మండల కేంద్రాల్లో కూడా యోగా, ధ్యాన కేంద్రాలు వెలిశాయి. ప్రత్యేకించి ఓం శాంతి సంస్థ పేరిట బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం సభ్యులు యోగా, ధ్యానం ద్వారా ప్రజల్లో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారు.

గురువులు–సేవలు

కడప నగరంలో సీనియర్ యోగా మాస్టర్ నామా నరసింహయ్య అమ్మవారిశాలలో పాతికేళ్లగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. ఉచితంగా నిర్వహించే ఆయన నియమ నిబంధనల విషయంలో స్పష్టంగా ఉంటారు. మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, డాక్టర్ కె.కల్పనలు యోగా గురించి విస్తృత ప్రచారం చేశారు. ఈ విద్యలో వారు దేశంలోని అన్ని ప్రతిష్టాత్మక అన్ని యోగా కేంద్రాలలో నెలల తరబడి శిక్షణ పొంది వచ్చారు. వైద్యులు కావడంతో యోగా శరీరంపై చూపే ప్రభావాన్ని వివరిస్తూ నేర్పుతుంటారు. దీంతో వీరి సంస్థకు మంచి ఆదరణ ఉంది. నగర శివార్లలో గల ఆంజనేయ పిరమిడ్ సొసైటీ కూడా నాలుగేళ్లుగా యోగ శిక్షణ ఇస్తోంది. ప్రతి ఆదివారం సభ్యులంతా సామూహికంగా యోగా చేస్తారు. దాని ప్రయోజనాలు, ప్రచారం గురించి చర్చలు నిర్వహిస్తున్నారు. కడప నగరం అరవిందనగర్‌లో గల విశ్వాత్మ పిరమిడ్ యోగా ధ్యాన కేంద్రం నిర్వాహకులు ప్రొఫెసర్ జీవీ శేషారెడ్డి, డాక్టర్ ఊర్మిళ యోగా మినహా మరో వ్యాపకం లేకుండా ఈ ప్రక్రియ గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 70 పాఠశాలల్లో యోగా గురించి అవగాహన కల్పించారు. యోగాసనాలను సాధన చేయించారు. ప్రతి ఆదివారం శాకాహారం గురించి ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో సీనియర్ యోగా మాస్టర్ సిద్దయ్య, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో వీరభద్రారెడ్డి, హరినాథరెడ్డి, విష్ణు యోగా సెంటర్‌లో యలవలి రమేష్ బాబు ఆధ్వర్యంలో, సాయిబాబా అనాథ శరణాలయంలో యోగా గురువు స్వామ్రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలోని ప్రైవేటు హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులను యోగా రంగంలో జాతీయ స్థాయి బహుమతులను అందుకునేలా తీర్చిదిద్దారు. జిల్లా వ్యాప్తంగా 60కి పైగా యోగా కేంద్రాలు, వాటి ద్వారా ఆరు వేల మందికి పైగా యోగా శిక్షణ పొందుతున్నారు. వారిలో కొందరు గురువులుగా మారి మరికొందరికి యోగా శిక్షణ ఇస్తున్నారు. కొందరు ఉదయం పూట, మరికొన్ని కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో కూడా యోగా నేర్పుతున్నారు. మొండివ్యాధులతో బాధపడుతున్న ఎందరో కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా ఫలితం కన్పించక యోగా కేంద్రాలను ఆశ్రయించి రుగ్మతల నుంచి బయటపడ్డ కేసులు చాలా ఉన్నాయి. కొన్ని కేంద్రాలలో క్యాన్సర్ రోగులు కూడా యోగా ద్వారా ఉపశమనం పొందారు. ఇంకా బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర వ్యాధులకు కూడా యోగా తిరుగులేని మందుగా ఆయా సమస్యల నుంచి బయటపడిన వ్యక్తులు పేర్కొంటున్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు యోగా విద్యలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తెస్తున్నారు.

వేధింపులకు పాల్పడ్డ యువకుడిపై కేసు నమోదు

మదనపల్లె : సహజీవనం చేస్తున్న యువతిని మానసికంగా వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించిన యువకుడిపై వేధింపుల కేసు నమోదైంది. తాలూకా సీఐ సత్యనారాయణ మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలో నివాసం ఉంటున్న జి.శ్వేత పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన షాకీర్‌ను ప్రేమించి, అతడితో సహజీవనం చేస్తోంది. శ్వేతకు తల్లిదండ్రులు చనిపోవడం, సోదరుడు దూరంగా ఉండటంతో మానసికంగా కుంగుబాటుకు గురైంది. ఈ క్రమంలో సహజీవనం చేస్తున్న షాకీర్ తనను పెళ్లిచేసుకునేందుకు నిరాకరించడంతోపాటు తరచూ వేధింపులకు పాల్పడుతుండటంతో మనస్తాపం చెందింది. దీంతో సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు పునీత్ ఫిర్యాదు మేరకు నిందితుడు షాకీర్‌పై 306 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మడుగు నీటిలో పడి యువకుడి మృతి

రాజంపేట : హత్యరాలలోని మడుగు నీటిలో పడి గుణశేఖర్ (20) అనే యువకుడు మృతి చెందాడు. మందరం రాజుపల్లె గ్రామానికి చెందిన ఇతను పశువులను మేతకు హత్యరాల సమీపానికి తోలుకెళ్లాడు. పశువులు మడుగులోకి దిగాయి. వాటిని బయటికి తోలే సందర్భంలో నీటి మునిగాడు. ఎంత సేపటికీ ఇంటిరాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. మడుగుపై తేలుతున్న గుణశేఖర్‌ను గుర్తించారు. బయటికి తీస్తే అప్పటికే మృతి చెందాడు. అయితే ఈ ప్రమాదంపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

హోటళ్లపై విజిలెన్స్ దాడులు


కడప హోటల్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం

కడప అర్బన్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అదనపు ఎస్పీ షేక్ మాసుంబాష ఆదేశాల మేరకు మంగళవారం విజిలెన్స్ అధికారులు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం, కడప నగరపాలక సంస్థ శానిటరీ అధికారులు హోటళ్లపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. కడప నగరంలోని ఐదు హోటళ్లు, పారడైజ్ ఫుడ్‌కోర్టుల్లో గడువు ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ 2006 కింద కేసులు నమోదు చేశారు. ఆయా హోటళ్లకు మొత్తం రూ.1,80,000 జరిమానా విధించారు. ఈ హోటళ్లలో రాజ్ మయూర గార్డెనియా యాజమాన్యానికి రూ.50,000, మయూర బేకరీకి రూ.60,000, ఆంధ్రరుచులుకు రూ.10,000, స్వప్న బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ.40,000, రాయలసీమ స్పైస్‌కు రూ.20,000 జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని ఆయా హోటళ్ల యజమానులు కడప నగర పాలక సంస్థకు చెల్లించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ టి.రెడ్డెప్ప, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయకిషోర్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎం.డి షంషీర్‌ఖాన్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సంయుక్తంగా పాల్గొన్నారు.

రెస్టారెంట్లకు జరిమానా

ప్రొద్దుటూరు : పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుం బాషా, ఆఫీసర్ పూల రామకృష్ణ, సీఐ అశోక్‌కుమార్, ప్రొద్దుటూరు డివిజన్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిత, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డిలు తనిఖీల్లో పాల్గొన్నారు. పట్టణంలోని సాగర బార్ అండ్ రెస్టారెంట్, ఆంధ్ర కిచెన్, హైదరాబాద్ చెఫ్స్, సిప్ ఇన్ రెస్టారెంట్ అండ్ బార్ హోటల్‌లో తనిఖీలు చేశారు. కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత పరిమితులను అధికారులు పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని సాగర్ బార్ అండ్ రెస్టారెంట్‌పై రూ.50 వేలు జరిమానా విధించారు. ఆంధ్రకిచెన్ రెస్టారెంట్‌పై రూ.25 వేలు జరిమానా, హైదరాబాద్ చెఫ్స్ రెస్టారెంట్‌పై రూ.25 వేలు, సిప్ ఇన్ రెస్టారెంట్ అండ్ బార్‌పై రూ.50 వేలు జరిమానా విధించారు. ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరిశీలనకు స్టేట్ ఫుడ్ ల్యాబోరేటరీకి పంపించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాసుం బాషా మాట్లాడుతూ హోటల్, రెస్టారెంట్ వారు వినియోగదారులకు నాణ్యమైన పదార్థాలు అందించాలని తెలిపారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన ప్రమాణాలతో వంటకాలను తయారు చేసి అమ్మాలని చెప్పారు. ఆహార పదార్థాల్లో చైనా సాల్ట్, ఫుడ్ కలర్ ఇతర నిషేధిత పదార్థాలు వాడరాదని, పార్సిల్ విషయంలో ప్లాస్టిక్ కవర్లు వాడరాదని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని సంస్థలపై భారీ ఎత్తున జరిమానా విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా నమదు చేసి వ్యాపార సంస్థలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లి గ్రామంలో మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేవతిపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నమాచుపల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేవతి గ్రామంలో డ్రైనేజీ పూడిపోయిందన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి స్విప్ట్ మిషన్ ద్వారా అక్కడ వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టింది. ఈ సమయంలో చిన్నమాచుపల్లికి చెందిన పోతుల బాల సుబ్బారెడ్డి, ఆయన భార్య వెంకటసుబ్బమ్మ, మరో వ్యక్తి కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేవతిపై దాడి చేశారు. పోతుల బాల సుబ్బారెడ్డి దుర్భాషలాడి, వెంకటసుబ్బమ్మ చేయి చేసుకున్నారని రేవతి తెలిపారు. విధులకు ఆటంకం పరచడమే కాకుండా, బెదిరించి దాడి చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


రామాంజనేయులు మృతదేహం

కడప అర్బన్ : చెట్టుపై నుంచి కింద పడి గాయాల పాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలో కార్పొరేటర్ సుబ్బరాయుడు ఇంటి ఆవరణలో వున్న చెట్టును కొట్టివేసేందుకు అతని అన్న, బేల్దారి రామాంజనేయులు (56) ఈనెల 11న వచ్చాడు. ఉదయం చెట్టును కొడుతుండగా.. అదుపు తప్పి చెట్టుపై నుంచి బాత్‌రూంపైకి అక్కడి నుంచి కిందికి జారిపడ్డాడు. తీవ్ర గాయాల పాలైన అతన్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.వి నాగరాజు తెలియజేశారు.

చట్టాన్ని అతిక్రమిస్తే జిల్లా బహిష్కరణ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : చట్టాన్ని అతిక్రమించి సివిల్ పంచాయితీలు, దందాలకు పాల్పడిన రౌడీషీటర్లపై పీడీ చట్టాన్ని ప్రయోగించడంతోపాటుగా జిల్లా బహిష్కరణ విధిస్తామని డీఎస్పీ కేశప్ప తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు మదనపల్లె పోలీస్ డివిజన్ పరిధిలోని 242 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్‌పైన తాము నిఘా ఉంచామని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి సెటిల్‌మెంట్లు, దందాలకు పాల్పడినట్లు సమాచారం అందితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 19, టూటౌన్‌లో 37, తాలూకాలో 39, ముదివేడులో 27, నిమ్మనపల్లె 18, బి.కొత్తకోట 15, రామసముద్రం 20, ములకలచెరువు 15, తంబళ్లపల్లె 19, పెద్దమండ్యం 8, పీటీఎం పోలీస్‌స్టేషన్‌లో 25 మంది మొత్తం 242 మంది రౌడీషీటర్లు ఉన్నారన్నారు. రౌడీషీటర్ల ప్రవర్తను నిరంతరం పరిశీలిస్తుంటామని, స్థానిక ఎస్ఐల ద్వారా నివేదిక తెప్పించుకుని సత్ప్రవర్తన కలిగిన వ్యక్తుల రౌడీషీట్ తొలగిస్తామన్నారు. ఎవరైనా నాటుసారా, అక్రమమద్యం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది డిసెంబర్ వరకు సత్ప్రవర్తన కలిగిన రౌడీషీటర్ల ప్రవర్తనను గమనించి తర్వాత షీట్ తొలగిస్తామన్నారు. టూటౌన్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు భవిష్యత్తులో కుటుంబంతో ప్రశాంతంగా జీవించేందుకు సత్ప్రవర్తన అవసరమన్నారు. కార్యక్రమంలో తాలూకా సీఐ సత్యనారాయణ, రూరల్ సీఐ శివాంజనేయులు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

పీలేరు రూరల్ : ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో చోటు చేసుకుంది. రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లె పంచాయతీ మల్లెలకు చెందిన టి.కృష్ణమ్మ (65) పీలేరు వారపు సంతకు వెళ్లింది. వారపు సంత నుంచి స్వగ్రామానికి వెళ్లడానికి ఆర్టీసీ బస్టాండ్‌లోనికి వచ్చే సమయంలో పీలేరు - మార్కెళ్ల బస్సు సర్వీసు బస్టాండులో ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

కరెంటు షాక్‌కు గురైన వ్యక్తి మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ రామాపురం వద్ద ఈ నెల 17న కరెంటు షాక్‌కు గురైన వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి తాలూకా చేలూరుకు చెందిన ఎస్.శంకర్ (46) రామాపురం వద్ద 407 వాహనంలో కట్టెల లోడు వేస్తూ పైనున్న విద్యుత్ తీగలు చూసుకోకపోవడంతో ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సూచనల మేరకు క్షతగాత్రుడిని బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు మంగళవారం పేర్కొన్నారు.

నిర్మాణం ఆపండి.. వివాదం పరిష్కరించండి


నిర్మాణానికి సామగ్రి సిద్ధం చేసుకున్న దృశ్యం

వీరబల్లె (రాయచోటి టౌన్) : అధికారుల ఆదేశాలను సైతం ఖాతరు చేయకుండా హిమబిందు అనే మహిళ ఇంటి నిర్మాణాలు చేపడుతోందని గ్రామస్తుడు జి.వెంకట్రాజు తహసీల్దార్ తులశమ్మకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీరబల్లె మండల పరిధి సానిపాయి గ్రామంలోని రాచపల్లెలో వెంకట్రాజు, హిమబిందుల మధ్య సర్వే నంబర్ 240లో 21.5 సెంట్ల భూ వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ వివాదం కోర్టులో నడుస్తుండగానే హిమబిందు ఆ భూమిలో ఇంటి నిర్మాణ పనులు సాగిస్తోంది. ఈ భూమి విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి జి.వెంకట్రాజు తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు ఆ ప్రదేశానికి వచ్చి సర్వేయర్‌తో సర్వే చేయించి ఎవరి భూమి అయితే వారికి ఇస్తామన్నారు. అప్పటికే ఆమె పోలీసులను ఆశ్రయించగా వారు కూడా ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ వ్యవహారం గత కొన్ని సంవత్సరాలుగా కోర్టులో నడుస్తోంది. ఇలా అన్ని శాఖల అధికారులు చెప్పినా వారి ఎవరి మాట ఖాతరు చేయకుండా యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు చేస్తోందని, తమకు న్యాయం చేయాలని బాధితుడు తహసీల్దార్‌ను కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ తులశమ్మ త్వరలో సర్వేయర్‌తో సర్వే చేయించి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేసినట్టు బాధితుడు చెప్పాడు.

సరిగమలూ... మధురిమలు..!

నేడు ప్రపంచ సంగీత దినోత్సవం


సంగీతం నేర్చుకుంటున్న చిన్నారులు

కడప కల్చరల్ : కవితాత్మకమైన మాటలకు మంచి బాణి కూర్చితే మధురమైన పాట అవుతుంది. మదిని కట్టేస్తుంది. ఆనందంతో ఊపేస్తుంది. పల్లెటూరి డప్పు అయినా.. పండితుని మృదంగం అయినా.. ఒకే స్థాయిలో మనసును రంజింపజేస్తాయి. కష్టజీవి నుంచి మహా విద్వాంసుని వరకు సంగీతమంటే అందరికీ ఇష్టమే. బుధవారం ప్రపంచ సంగీత దినోత్సవం. ఈ సందర్భంగా జిల్లాలోని సంగీతకారులు, స్థితిగతుల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం.

జిల్లాలో...

మన జిల్లాకు కళల జిల్లాగా గొప్ప పేరుంది. సంగీతం విషయంలో పదకవితా పితామహులు అన్నమాచార్యులు తన కీర్తనలకు కట్టిన బాణీలు నేటికీ సామాన్యులను సైతం ఓలలాడిస్తున్నాయి. కవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు సంగీతంలో లోతులు తెలిసిన వారు. ఆయన రచించిన శివతాండవం కావ్యం సంగీత ప్రధానంగా ఉండడం విశేషం. గణిత మేధావి లక్కోజు సంజీవరాయశర్మ మంచి వాయులీన విద్వాంసులు. ఎంత క్లిష్టమైన లెక్క ఇచ్చినా వయోలిన్‌ను పలికించి మరుక్షణంలోనే ఆ లెక్కకు సమాధానం చెప్పేవారు.

నిన్న–నేడు

ఇటీవలి కాలంలో శ్రీరామ నవకాంత్, గిరిజ, గువ్వల సుబ్బరాయుడు, టీవీఎస్ ప్రకాశ్, శ్రీవాణి అర్జున్ గాయకులుగా విశేషమైన గుర్తింపు సాధించారు. వీరిలో కొందరు సినిమాల్లో కూడా పాడారు. నేలబొట్ల చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు ఈ రంగంలో కృషి చేస్తున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన యువతి కావ్యచందన సినిమాల్లో పాడుతూ జిల్లాకు ఖ్యాతి గడించి పెడుతున్నారు. అంతకుముందు తరంలో కొండపేట కమాల్‌రాజులు గాయకులుగా గొప్ప పేరు సాధించారు. గతంలో ఆరవేటి శ్రీనివాసులు, మునెయ్య జానపద గాయకులుగా జిల్లాలోని జనపదాలకు పేరు తెచ్చారు. ఆర్డీ ప్రసాద్‌రావు జిల్లాలో మంచి సంగీత దర్శకుడిగా పేరు పొందారు. అంధ గాయకుడు సాంబశివుడు తన సంగీత ప్రతిభతో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం నిర్వహించే సంగీత పోటీలకు కూడా న్యాయ నిర్ణేతగా వెళ్లేవారు. ప్రస్తుతం నగరానికి చెందిన శ్రీవాణి అర్జున్ శాస్త్రీయ, లలిత సంగీత విభాగాల్లో గొప్పగా రాణిస్తున్నారు. ప్రస్తుతం కడప నగరానికి చెందిన యువకుడు వాట్‌కిన్స్ సినిమా సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు. వాయిద్య విభాగంలో తబల సోమయ్య, తబల సుబ్బరాయుడు, గిటారు కళాకారుడు రంజన్, ఆరు తబలాలను ఒకేసారి పలకించగల దిట్ట దండు శ్రీనాథమణి జిల్లాకు ఖ్యాతి తెచ్చారు. అంధుడైన సాంబశివుడు గాయకుడిగా, సంగీత దర్శకుడిగా మధుర గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం అభిమానాన్ని సాధించడం విశేషం. జిల్లాకు చెందిన యువ గాయకుడు పెంచలదాస్ స్వయంగా రచించిన జానపద గేయాలను ఇటీవల సినిమాల్లో పాడుతూ ఆ రంగాన్ని ఒక ఊపు ఊపుతున్నారు. ప్రముఖ హీరోలు కూడా ఆయనతో పాడించుకోవడం విశేషం. జిల్లాకు చెందిన 'బంటి' రుతురాగాలు తదితర ఎన్నో టీవీ సీరియళ్లకు సంగీతం అందించారు. పీడీ బాలసుబ్రమణ్యం జిల్లాలో ఆర్కెస్ట్రాలకు ఆద్యుడిగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో నేడు జిల్లాలో 30కి పైగా ఆర్కెస్ట్రాలు ఏర్పడ్డాయి.

రికార్డింగ్ సౌకర్యం

కడప నగరంలో రికార్డింగ్ సౌకర్యం కూడా ఉంది. మాటలు, పాటలకు సంగీతం పొదిగి పాటలాగా మార్చి రికార్డు చేసి అందించే స్టూడియో ఉంది. బాబు స్టూడియో పేరిట దీనికి మంచి డిమాండ్ ఉంది.